నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 27 అక్టోబర్ 2024 | HYDERABAD

• అమ్మో.. ట్రాఫిక్!

బంజారాహిల్స్ రోడ్ నం. 12 రోడ్డులో శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంపై మండిపడ్డారు.

చలో సెక్రటేరియట్..విద్యార్థుల అరెస్టు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ.. శనివారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయం ముట్టడికి వెళ్తున్న విద్యార్థులను బీఆర్‌కే భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా అరెస్టు చేసి.. తీసుకెళ్లారు. పోలీసులు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి.

ముత్యాలమ్మ గుడి కేసు సీసీఎస్‌కు..

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో విగ్రహం ధ్వంసం చేసిన కేసును మార్కెట్ పోలీసు స్టేషన్ నుంచి సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఇటీవల దుండగుడు కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలోకి చొరబడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక ప్రజలు, హిందూ ధార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి. కాగా, దర్యాప్తులో భాగంగా ఇప్పటికే విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విధ్వంసానికి వ్యూహరచన జరిగిన సికింద్రాబాద్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌ను సైతం సీజ్ చేశారు. కాగా దర్యాప్తు మరింత వేగవంతం చేసే క్రమంలో కేసును మార్కెట్ పీఎస్ నుంచి నగర సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కిన చైన్‌స్నాచర్

వృద్ధురాలి మంగళ సూత్రం అపహరించిన నిందితుడి అరెస్టు

వెంగళరావునగర్, అక్టోబర్ 26 :వృద్ధురాలి మెడలో నుంచి మంగళసూత్రం అపహరించిన నిందితుడిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎస్ఆర్ నగర్ ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. బోరబండ, హబీబ్ ఫాతిమానగర్‌కు చెందిన గుడిమెట్ల గోపీనాథ్(25) ఓ కంపెనీలో పనిచేసి ఇటీవల మానేశాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చోరీ చేయాలనే పథకం వేశాడు. శుక్రవారం సాయంత్రం జెక్‌కాలనీలో సాయంత్రం నడకకు వచ్చిన అలమూరి కృష్ణకుమారి(64) మెడలో నుంచి 3తులాల బంగారు మంగళ సూత్రాన్ని తెంచుకొని ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య నేతృత్వంలో నిందితుడి జాడ కోసం జల్లెడ పట్టారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని అమీర్‌పేట గురుద్వార సమీపంలో అరెస్టు చేసి, బంగారు మంగళసూత్రాన్ని ,చోరీకి ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒక రోజు వ్యవధిలోనే గొలుసు దొంగను పట్టుకున్న ఎస్ఆర్‌నగర్ క్రైం, టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏసీపీ అభినందించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

నేడు నాచారానికి కేటీఆర్ రాక

ఉప్పల్: నాచారంలోని ఎస్టీపీని ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, డివిజన్ల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పార్టీ ప్రతినిధులు సూచించారు. ఎస్టీపీ వద్దకు ఉదయం 8 గంటలకు కేటీఆర్ రానున్నట్లు తెలిపారు.

నేడు మూసీ బాధితులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భేటీ

ఎల్బీనగర్, అక్టోబర్ 26: ఎల్బీనగర్ నియోజకవర్గం మూసీ పరీవాహక ప్రాంతాల్లోని కాలనీవాసులు, నిర్వాసితులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మరోసారి సమావేశం కానున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మూసీ పరీవాహక ప్రాంతాల నిర్వాసితులతో ఎమ్మెల్యే సమావేశమవుతారని బీఆర్ఎస్ నాయకుడు సొంటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విద్యుత్‌నగర్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ద్వారాకాపురం రోడ్ నం.8 మైదానంలో భవానీనగర్, ద్వారాకాపురం, గణేశ్‌పురి, ఇందిరానగర్ మూసీ నిర్వాసితులతో సమావేశం ఉంటుందన్నారు.

విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ పెరిగిందా..? ఆ భారం మీదే అంటోంది... దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే వినియోగంలో ఉన్న పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లపై కనెక్షన్ల భారం పెరిగి ఓవర్‌లోడ్ అయితే, దానిని అధిగమించేందుకు ఆ ప్రాంతంలోని వినియోగదారులే ఆ భారాన్ని భరించాలంటూ.. నిర్ణయాలు తీసుకుంటున్నది. క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రతి విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్లను జీపీఎస్‌తో అనుసంధానం చేసి వాటిపై ఎంతలోడు ఉన్నదనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

-సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ)

ఓవర్ లోడ్.. మీదే భారం

- వినియోగదారుల నడ్డి విరిచేలా డిస్కం చర్యలు
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు బాధ్యత కస్టమర్లపైనే

పెరుగుతున్న లోడ్..

గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్ల పరిధిలో సుమారు 1.85 లక్షల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, వాటిపై చాలా చోట్ల ఓవర్ లోడ్ ఉందని గుర్తించారు. ఇలా గుర్తించిన ఓవర్ లోడ్‌ను అధిగమించేందుకు విద్యుత్ శాఖనే ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడమో, లేక అదనంగా మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే విద్యుత్ శాఖపై పడే భారాన్ని వినియోగదారులపై వేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. అందులో భాగంగానే రకరకాల కారణాలు చెబుతూ.. వినియోగదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి అందులో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఎంత మొత్తంలో కరెంటు వినియోగం జరుగుతున్నదో గుర్తిస్తున్నారు. ఒక భవనంలో 20 కిలోవాట్ల సామర్థ్యం దాటితే.. సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు. అదే సమయంలో చిన్న చిన్న కాలనీలు ఉంటే.. ఆ ప్రాంతంలోని అదనంగా సొంత ఖర్చులతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.



గ్రేటర్ పరిధిలోని కోర్ సిటీతో పాటు శివారు ప్రాంతాల్లో కొత్తగా ఇండ్ల నిర్మాణాలు వస్తుండడంతో విద్యుత్ కనెక్షన్లు గణనీయంగా పెరుగుతున్నాయి. అప్పటికే వినియోగంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వెళ్లే ఎల్ టీ లైన్ల నుంచే కొత్త కనెక్షన్లను విద్యుత్ శాఖ అధికారులు జారీ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ శాఖే అక్కడున్న కనెక్షన్లు, వాటి లోడును పరిగణలోకి తీసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ విషయాన్ని ఏ మాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదు. అడిగిన వారికల్లా కొత్త కనెక్షన్లు ఇవ్వడం వల్ల ఒక్కసారిగా ఆ ప్రాంతంలోని లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్ పెరిగి తరచూ విద్యుత్ అంతరాయాలు తలెత్తున్నాయి. ఈ విషయంలో విద్యుత్ శాఖనే సొంత ఖర్చులతో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడమో, అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని కయ్యే ఖర్చును అంతా వినియోగదారుల మీద వేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలోనే అపార్టుమెంట్లకు మాత్రమే సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పిన అధికారులు..ఇప్పుడు వ్యక్తిగత ఇండ్లలో ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు, వినియోగం ఉంటే వాటి యజమానులు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు చెప్పినట్లు చేసుకోవాలంటే గ్రేటర్ పరిధిలోని 10 సర్కిళ్లలో 20వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగదారులే సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది తమకు ఎంతో భారంతో కూడుకున్నదని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వినియోగదారులపై భారం మోపకుండా, ఓవర్ లోడ్‌ను అధిగమించే శాఖపరంగానే విద్యుత్ నెట్‌వర్క్‌ను విస్తరించి, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతిగా

పలుకూరి లక్ష్మి బాధ్యతలు

సిటీబ్యూరో: ఉస్మానియా దవాఖాన ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతిగా ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో 2000 నుంచి 2005 వరకు ప్లాస్టిక్ సర్జరీలో పీజీ పూర్తి చేసిన ఆమె 2005 ఆగస్టులో అదే దవాఖానలో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2010లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2020 అక్టోబర్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం తొలి మహిళా అధిపతిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు. 2022 అక్టోబర్ వరకు ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తించిన లక్ష్మి రెండోసారి ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో హెచ్‌వోడీగా పనిచేసిన సమయంలో జాతీయ స్థాయి అవగాహన సదస్సులు, ఇయర్ రీ కన్‌స్ట్రక్షన్ హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్, బర్న్స్‌లో జాతీయ స్థాయి మిడ్ టర్మ్ కాన్ఫరెన్స్‌లు, ప్లాస్టిక్ సర్జరీ పీజీలకు జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ప్లాస్టిక్‌వేస్ట్‌పై శిక్షణ కార్యక్రమాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన డా.లక్ష్మి తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా 'ఎథికాన్ గంగా' ఫెలోషిప్‌ను పొందారు. జాతీయ బర్న్స్ అసోసియేషన్, నేషనల్ ప్లాస్టిక్ సర్జరీ అసోసియేషన్‌లకు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. రెండోసారి ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డా.లక్ష్మీ పలుకూరి మాట్లాడుతూ వైద్యరంగంలో వస్తున్న అత్యాధునిక చికిత్సా పద్ధతుల్లో భాగంగా 'ప్లాస్టిక్ సర్జరీ' విభాగంలో కూడా పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం కాలిన గాయాలకు గురైన వారికే కాకుండా క్యాన్సర్ రోగులు, రోడ్డు ప్రమాదాలకు గురైన వారు, ఇతర ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన వారికి అవయవాల పునర్నిర్మాణ చికిత్సలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రోగికి కొత్త రూపంతో పాటు కొత్త జీవితాన్ని ప్లాస్టిక్ సర్జరీ విభాగం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆధునిక చికిత్సా పద్ధతులపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కాగా ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతిగా బాధ్యతలు చేపట్టిన డా.లక్ష్మికి పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌ను జయిద్దాం

కేబీఆర్ పార్కులో శనివారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం కోసం అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర సీపీ సీవీ ఆనంద్, అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, ఆంకాలజిస్టులు, నర్సులు, వైద్యులతో సహా 100 మంది పాల్గొన్నారు.

-సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తేతెలంగాణ)

మాటల్లోనే లాస్ట్‌మైల్ కనెక్టివిటీ!

యాప్ ఆధారిత ట్యాక్సీ సేవలకు ముసుగు

మెట్రో ప్రయాణికులకు తప్పని పాట్లు

- సొంత వాహనాల్లోనే స్టేషన్ల దాకా ప్రయాణం
- కొత్తగా తెచ్చింది ఏమీ లేదు..

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం ఇంటి నుంచి మెట్రో స్టేషన్ వరకు, అక్కడి నుంచి పనిచేసే కార్యాలయాల వరకు ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకు రావాల్సిన బాధ్యత హెచ్ఎంఆర్‌పై ఉంది. నగరంలో మెట్రో సేవలు ప్రారంభమై ఆరేండ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ సరైన లాస్ట్ మైల్ కనెక్టివిటీ సౌకర్యం లేదని మెట్రో ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ కారణంగా ప్రయాణికులు ఇంటి నుంచి మెట్రో స్టేషన్ వరకు తమ సొంత వాహనాల్లోనే వస్తున్నారు. టర్మినల్ స్టేషన్లు అయిన నాగోల్, మియాపూర్, ఎల్బీనగర్, రాయదుర్గం, పరేడ్ గ్రౌండ్, అమీర్‌పేట ,హబ్సిగూడ మెట్రో స్టేషన్ వంటి ప్రాంతాల్లో వేలాది వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటికే మెట్రో చార్జీలు ఎక్కువగా ఉన్నాయని, అయినా త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని మెట్రోలో ప్రయాణిస్తున్నారు. అయితే ఇదే అదునుగా భావిస్తున్న అధికారులు పార్కింగ్ ఫీజులు సైతం పెంచుతూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

షటిల్ సర్వీసులు ఏర్పాటు చేస్తే..

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా 69 కి.మీ మెట్రో నెట్ వర్క్‌లో నిర్మించిన 59 మెట్రో స్టేషన్ల సమీప ప్రాంతాలను ప్రత్యేకంగా షటిల్ సర్వీసులను మెట్రో సంస్థలే నడపాల్సి ఉంటుంది. కానీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ మొక్కుబడి చర్యలతో నెట్టుకొస్తున్నది. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో ప్రముఖ యాప్ అగ్రిగేట్ సంస్థలైన ఓలా, ఉబర్, ర్యాపిడో, మన యాత్రీ వంటి కంపెనీలతో మెట్రో అధికారులు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇలాంటి ఒప్పందాల వల్ల రోజు వారీ మెట్రో ప్రయాణికుల లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అవసరాలు ఏ మాత్రం తీరడం లేదు. హైదరాబాద్ కేంద్రంగా యాప్ ఆధారిత సంస్థలు తమ సేవలను నగరం నలుమూలలా నిర్వహిస్తూనే ఉన్నాయి. వాటి ధరలు ఎక్కువగానే ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో అధికారులు లాస్ట్ మైల్ కనెక్టివిటీ అనే ముసుగు తొలగించడం ఏమిటని మెట్రో ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండే మెట్రోస్టేషన్లను గుర్తించి, ఆయా స్టేషన్లకు 3-5 కి.మీ పరిధిలో నిరంతరం ఆటో రిక్షాలు, ఆర్టీసీ బస్సులు,ఇతర ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉండేలా చేస్తేనే లాస్ట్ మైల్ కనెక్టివిటీకి న్యాయం చేసినట్లు అవుతుందని రవాణా రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మెట్రో అధికారులు నగరంలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ విషయంపై ప్రధానంగా దృష్టి సారించి, షటిల్ సర్వీసులను ఏర్పాటు చేస్తే..మెట్రోలో ప్రయాణించే వారికి సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే అభిప్రాయాన్ని నగర వాసులు వ్యక్తం చేస్తున్నారు.

సిటీబ్యూరో, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజా రవాణా వ్యవస్థల నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నగరంలో ప్రతి 50 లక్షల జనాభాకు 200 కి.మీ మెట్రో రైల్ నెట్ వర్క్ ఉండాలి. అలాంటిది మన మహానగరంలో ప్రస్తుతం కోటిన్నర జనాభా ఉండగా, భవిష్యత్తులో మరో 2 కోట్ల దాకా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంలో400 కిలో మీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్‌ను నిర్మించేలా దశల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన హైదరాబాద్ మెట్రో అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణంగా నగరంలో మెట్రో రైలు మార్గాలను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి, వాటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి.. ప్రభుత్వానికి అందించాల్సిన మెట్రో అధికారులు.. చిత్తశుద్ధి కనబర్చడం లేదనే ఆరోపణలున్నాయి. ఏయే మార్గాల్లో మెట్రో కారిడార్లను నిర్మించాలో కచ్చితమైన సమాచారంతో ప్రభుత్వాలకు నివేదించాల్సిన మెట్రో యంత్రాంగం విఫలమవుతున్నది. రెండో దశ మెట్రో ప్రాజెక్టులో మరిన్ని మార్గాలను చేపట్టాల్సి ఉన్నా.. ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించిందని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర హైదరాబాద్ ప్రాంతానికి 3-4 మార్గాల్లో మెట్రో కారిడార్లను పరిగణలోకి తీసుకోవాల్సి ఉన్నా, దాన్ని పక్కన ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతానికి మెట్రో కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు, డీపీఆర్‌లు రూపొందించడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లేని నగరానికి మెట్రో మార్గాన్ని నిర్మించడంతో చూపుతున్న చిత్తశుద్ధి ఉత్తర హైదరాబాద్ ప్రాంతమైన మేడ్చల్, శామీర్‌పేట, కుత్బుల్లాపూర్,అల్వాల్, జీడిమెట్ల, దుండిగల్ వంటి ఏరియాలకు ఎందుకు మెట్రో మార్గాలను నిర్మించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధ్యయనం లేకుండానే మార్గాలను ప్రతిపాదించినట్లు మండిపడుతున్నారు.

మొక్కుబడిగా మెట్రో!

సిటీ ప్రజా రవాణాపై చిత్తశుద్ధేది?

అధ్యయనం లేకుండానే.. మార్గాల ప్రతిపాదన